కుటుంబ పాలనను అంతమొందించాలి

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిదిలోని రిడ్జ్ టవర్స్, ఐడీపీఎల్ కాలనీలో వాకర్స్‌ని కలిసిన హన్మంతరెడ్డి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కుటుంబ పాలనను అంతమొందించాలంటే.. అబివృద్ధి ఫలాలు అందరికి చెందాలంటే అది ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

జంగ్ 2023 తెలంగాణ



ఢీలాపడుతున్న ఆశావహులు

టికెట్ కేటాయింపులో కాంగ్రెస్ నాన్చుడు..

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించే విషయంలో నాన్చుడు ధోరణి అవలంభిస్తుండటం మూలంగా ఆ పార్టీ టికెట్ ఆశిస్తున్న పలువురు ఆశావహులు ఢీలాపడుతున్నారు. ఇప్పటికే కొంతమంది ఢిల్లీలో తిష్టవేయగా, మరికొంత మంది ఆశలు వదులుకుని ఇంటి దారి పట్టారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఆయనకు ఢిల్లీ నుంచి ఓ ముఖ్య నేత ఫోన్ చేయడంతో హడావిడిగా వెళ్లినట్లు తెలిసింది.

◆ అదే విధంగా ఇక్కడ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి సైతం తలకు టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఢిల్లీకి హైదరాబాద్‌కు చక్కర్లు కొడుతున్నారు.

◆ ఇదే క్రమంలో కొలను హనుమంత్‌రెడ్డికి దాదాపు టికెట్ ఖరారు అయిందని ఆ పార్టీ కార్యకర్తలు ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నారు. స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాల ద్వారా దూసుకుపోతున్న సొంటిరెడ్డి పున్నారెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు రాగా ఆయన వెళ్లి అధిష్టానం పెద్దలను జగ్గారెడ్డితో కలిసి టికెట్ కోసం ప్రయత్నం చేయగా ప్రభుత్వం ఏర్పడగానే తప్పకుండా మంచి అవకాశం ఇస్తామని స్పష్టం చేయడంతో ఆయన టికెట్‌పై ఆశలు వదులుకుని ఇంటికి వచ్చారు. ఇలా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎన్నికల కవాతు



సుభాష్‌నగర్: నవంబర్ నెలలో జరగనున్న శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఆలోచన చేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఏసీపీ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో కవాతు నిర్వహించారు. సూరారం, దుండిగల్, పేట్‌బషీరాబాద్, మేడ్చల్ పోలీస్‌స్టేషన్లకు చెందిన 110 మంది పోలీస్ సిబ్బంది ఈ కవాతులో పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఏసీపీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

దసరా ఉత్సవాలకు

చిత్తారమ్మ ఆలయం ముస్తాబు

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి పూజలు ప్రారంభం





ఆలయంలో కొలువు దీరిన చిత్తారమ్మదేవి

సుభాష్‌నగర్: దసరా పండుగను పురస్కరించుకొని ఈనెల 23న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి ఆలయం ముస్తాబైంది. ఈనెల 15ఆదివారం నుంచి 23వ తేదీన సోమవారం వరకు అమ్మవారిని వివిధ అలంకరణలో దర్శనమిస్తుందని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్ తెలిపారు. 15న బాలత్రిపుర సుందరి, 16న గాయత్రీ, 17న అన్నపూర్ణా, 18న మహాలక్ష్మి, 19న మహా చండిదేవి, 20న సరస్వతి, 21న లలిత త్రిపుర సుందరిగా, 22న దుర్గాదేవిగా, 23న రాజరాజేశ్వరి దేవిల అవతారంగా అమ్మవారు దర్శనమిస్తుందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు ఉదయం 5.30 గంటలకు అభిషేకం, అలంకరణ, 7 గంటలకు నక్షత్ర హారతి, మధ్యాహ్నం 12గంటలకు సామూహిక కుంకుమార్చన,నైవేద్యం హారతి, సాయంత్రం 6గంటలకు, కల్యాణ మండపంలో అభిషేకం కుంకుమార్చనలు ఉంటాయని తెలిపారు. దసరా రోజు సాయంత్రం 6గంటలకు శమీ పూజ, రావణ దహనం కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యల తరలి రావాలని కోరారు.

బతుకమ్మ శోభ

చిత్తూ చిత్తుల బొమ్మ... శివుని ముద్దుల గుమ్మ





కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. అనంతరం గౌరమ్మను బతుకమ్మ వద్ద పెట్టి పూజలు చేశారు. ఆ తర్వాత బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ ఆడారు. చిన్నారులు నవదుర్గల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఇలా ఒక రోజు ముందే కుత్బుల్లాపూర్‌లో బతకమ్మ శోభ కనిపించింది. – కుత్బుల్లాపూర్







బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యం



శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులతో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బంగారు తెలంగాణ బీజేపీతో సాధ్యమని.. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం రాత్రి ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు తెలుసుకున్న ఆయన తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తీరుస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు అలివేలు, విజయలక్ష్మి, సురేందర్, రవీందర్, శేఖర్, లక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్కీ స్కేటింగ్‌లో సత్తాచాటిన విద్యార్థులు

కుత్బుల్లాపూర్: జాతీయస్థాయి రూరల్ స్కీ స్కేటింగ్ పోటీల్లో వెంకటేశ్వరనగర్ నేతాజీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు 3రోజుల పాటు గుజరాత్‌లోని బరోడాలో జరిగిన గుజరాత్ పబ్లిక్ స్కూల్‌లో రోలర్ స్కీ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ నుంచి అండర్–14 విభాగంలో 800మీటర్లు, 1.5 టీమ్ స్ప్రింట్ విభాగంలో మేడ్చల్ జిల్లా రూలర్ స్కీ స్కేటింగ్ క్రీడాకారుడు, నేతాజీ హైస్కూల్ స్టూడెంట్ విజయ్ కుమార్ రెండు బంగారు పతకాలు, 200 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోచ్ రవళికను అకడమిక్ డైరెక్టర్ నందినిలు అభినందించారు.

అధికారం చేపట్టడం ఖాయం



◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల అండతో ముచ్చటగా మూడోసారి తమ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

కుత్బుల్లాపూర్: అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని ఈద్గా హాజీ డెవలప్‌మెంట్ కమిటీ, జామ మసీదు హాజీ అలీ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం రోడామేస్త్రీనగర్ (ఏ) బస్తీవాసులు ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా ఏకగ్రీవం తీర్మానం చేశారు. అనంతరం ఆయనను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ మఖ్సూద్ అలీ, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఉస్మాన్ తదితరులు ఉన్నారు.

◆ జీడిమెట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు వార్డు సభ్యురాలు బేకు శ్యామల తన అనురులతో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంట సిద్ధి రాములు, సంపత్ మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్, గ్యానేశ్వర్, గుమ్మడి మధుసూదన్, నరేందర్‌రెడ్డి, ఇందిరారెడ్డి, ఎల్లేశ్వరి, బాలమణి, ప్రమీల, లక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి సమస్యలను విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అటవీ అకాడమీలో శాస్త్రవేత్తల సమావేశం

సుభాష్‌నగర్: అటవీ జీవ వైవిద్య సంస్థ (ఐసీఎఫ్ఆర్ ఈ–ఐఎఫ్‌బీ) రీసెర్చ్ అడ్వైజరీ గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో సమావేశం జరిగింది. డైరెక్టర్ ఐఎఫ్ఎస్ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆన్‌లైన్ మీటింగ్‌లో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎలుసింగ్ మేరు, డాక్టర్ అక్షయ్‌కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీసెర్చ్ అడ్వైజరీ గ్రూప్ పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలు సమావేశం ముందుంచింది. తెలంగాణ, ఒడిస్సా అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు వినియోగించే పండ్లు, తినే పదార్థాలపై అధ్యాయనం , అగ్ని ప్రభావిత అటవీ ప్రాంతాల్లో ప్రకృతి సంపదను పునరుద్ధరించడంపై చర్చించారు.

భక్తిశ్రద్ధలతో మహా ప్రత్యంగిరా హోమం

జగద్గిరిగుట్ట: డివిజన్ ఫరిదిలోని అంజయ్యనగర్ మల్లికార్జునస్వామి ఆలయంలో మహా ప్రత్యంగిరా హోమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన ఈ హోమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీటితో పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలకు కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సే ధ్యేయం

కుత్బుల్లాపూర్: కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా బీఆర్ఎస్‌కేవీ పని చేస్తుందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, రెడ్డి ల్యాబ్స్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్లలోని డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ కంపెనీ నూతన వేతన ఒప్పందం విజయవంతంగా జరిగిన నేపథ్యంలో శుక్రవారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో కార్మికులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్ మాట్లాడుతూ వరుసగా ఆరు అగ్రిమెంట్లు చేసిన ఘనత తమకే దక్కుతుందని, కార్మికులకు న్యాయపరమైన అగ్రిమెంట్ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్మికులకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు బీఆర్ఎస్‌కేవీ సిద్ధంగా ఉంటుందని మదన్‌గౌడ్ పేర్కొన్నారు.

రాచర్ల సూరమ్మ మృతి తీరని లోటు

జగద్గిరిగుట్ట: స్వాతంత్ర్య పోరాట యోధురాలు రాచర్ల సూరమ్మ (90) మృతి తీరనిలోటని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య అన్నారు. మహబూబాబాద్ నుంచి వచ్చి బీరప్పనగర్‌లో స్థిర నివాసం ఏర్పరచుకొని జీవిస్తున్నారు. గూడ ఐలయ్య శుక్రవారం సూరమ్మ నివాసం వద్ద పార్థివదేహానికి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. సూరమ్మ మృతి తీరని లోటని ఐలయ్య సంతాపం వ్యక్తం చేశారు. సూరమ్మకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గద్గిరిగుట్ట: కల్వరి టెంపుల్ హాస్పిటల్ సౌజన్యంతో డివిజన్ పరిధిలోని షిరిడీ హిల్స్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు బస్తీ ప్రెసిడెంట్ సీహెచ్ దాసు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 2గంటల వరకు కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ గ్రంథాలయ భవనంలో ఈ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనిని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దుండిగల్: అనారోగ్యం కారణంగా ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. డి.పోచంపల్లి పరిధి డాక్టర్ బస్తీలో ఓ వ్యక్తి కొన్ని నెలలుగా గది అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. కూలీ పనులు చేసే ఇతనికి టీబీతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని.. ఎవరితోనూ మాట్లాడే వాడు కాదని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా స్థానికంగా ఉన్న ఓ మహిళ గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నివసిస్తున్న గది నుంచి దుర్వాసన వచ్చింది. ఈ విషయాన్ని స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించారు. అతడు ఐదు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు చంద్రశేఖర్

జగద్గిరిగుట్ట: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం... షిరిడీ హిల్స్‌కు చెందిన చంద్రశేఖర్ (32) రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ పనిచేసేవాడు.2నెలల క్రితం మానేసాడు. దీంతో ఫైనాన్సియల్‌గా కింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నరు. కాగా శుక్రవారం నుంచి తన పిల్లలకు సెలవులు ఉండదంతో స్వగ్రామం సూర్యాపేటకు వెళ్తానని భార్య రేఖ చెప్పింది. ఈ విషయమై చిన్నపాటి గొడవ కూడా జరిగింది.శుక్రవారం ఉదయం తన భార్య పిల్లలను ఊరికి స్వయంగా బస్సు దగ్గరకు వెళ్లి పంపించి ఇంటికి చేరుకున్నాడు. 9గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

